క్లుప్తంగా

ఎండిపోతున్న 'తెల్లబంగారం'



పూత, కాత రాలి ఎండిపోతున్న పత్తి మొక్కలు

దహెగాం: అధిక వర్షాలతో పత్తి పంట ఎండిపోతోంది. నెల క్రితం వరకు పత్తి బాగానే ఉండడంతో ఈసారి పంట దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తుందనుకున్నారు. కానీ గత పదిహేను రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నందున పత్తికి ఉన్న పూత, కాయ రాలిపోయింది. కేవలం పత్తి చెట్లు మాత్రమే ఉన్నాయి. ఉన్న పత్తి మొక్కలు కూడా ఎండిపోతున్నాయి. దీంతో ఈ సంవత్సరం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి 5 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చేలా లేదని దీంతో అప్పులు పెరిగిపోతాయని వాపోతున్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

లింగాపూర్: మండల కేంద్రంలో వారం క్రితం జాటోత్ హనుమంతు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి రెహమాన్ ఫౌండేషన్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.10వేల నిత్యావసర సరుకులను దశదిన కార్యక్రమం కోసం అందజేశారు. సభ్యులు జాటోత్ దవీత్, రాజేశ్, పాండు, ధర్మేందర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన దుర్గం సంతోష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. బాధిత కుటుంబసభ్యులను బుధవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించి రూ.4వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు సిరిపురం సదాశివ్, జాడి సంతోష్, అతహాబేగ్, ఆశన్న, లహంచు, బాపు, తిరుపతి, రాజన్న, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెంచికల్‌పేట్: మహారాష్ట్రలోని కమలాపూర్ అటవీ ప్రాంతంలో పెద్దపులి పిల్లలతో సంచరిస్తున్న నేపథ్యంలో సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెంచికల్‌పేట్ రేంజ్ అధికారి అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పులి పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని మురళీగూడ, జిల్లెడ, నందిగామ గ్రామాలకు సరిహద్దులో ఉన్న ప్రాణహిత తీరం వెంట సంచరిస్తుందన్నారు. పంట చేన్లకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని, పులి కదలికలు కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో అల్బర్ట్

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పీవో, ఏపీవోలుగా విధులు నిర్వర్తిస్తున్న పోలింగ్ సిబ్బందికి ఎంపీడీవో అల్బర్ట్ శిక్షణ తరగతులు నిర్వహించారు. రిటర్నింగ్ అధికారులు, టీవోటీ రమేశ్ పోలింగ్ విధులు, ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌పై ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ముస్లింలు

ఆసిఫాబాద్: ఇండోర్‌లో ఎమ్మెల్యే రాజాసింగ్ మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేశారని జిల్లా కేంద్రంలోని ముస్లింలు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఒక మతాన్ని కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో అబ్దుల్ రహమాన్, మోయిన్, మిన్వర్ ఖాన్, శహబాజ్ తదితరులు ఉన్నారు.

అధ్వానంగా రోడ్లు..!

- అధిక వర్షాలతో గుంతలు పడ్డ రహదారులు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మరమ్మతులు లేక ధ్వంసం
- పట్టించుకోని అధికారులు



ఈ ఫొటోలో గుంతలమయంగా కనిపిస్తున్న రోడ్డు దహెగాం నుంచి లగ్గాం మీదుగా పెంచికల్‌పేట్ మండలానికి వెళ్లే ప్రధాన రహదారి. ఈ బీటీ రోడ్డునే ఏడేళ్ల క్రితం వేయగా, రోడ్డు చెడిపోయి మూడేళ్లు అవుతున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మండల కేంద్రం నుంచి లగ్గాం ఎక్స్‌రోడ్డు నాలుగు కిలోమీటర్ల వరకు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు గుండా నిత్యం వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏర్పడ్డ గుంతలలో వర్షపు నీరు నిలిచి ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.



ఈ రోడ్డు దహెగాం నుంచి కల్వాడ మీదుగా బెల్లంపల్లికి వెళ్లే రోడ్డు. ఈ రోడ్డు సైతం అధ్వానంగా మారింది. నల్ల చెరువు వద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ఈ రోడ్డు గుండా కార్లు రావడం లేదు. మండల కేంద్రం నుంచి బెల్లంపల్లికి వెళ్లేవారు హత్తిని మీదుగా వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. నిత్యం ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రధాన రహదారులు పూర్తిగా అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దహెగాం: మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే మూడు దిక్కుల రోడ్లు అధ్వానంగా మారాయి. ఇతర ప్రాంతాల వాహనదారులు మండల కేంద్రానికి రావడానికి వెనుకాడుతున్నారు. మండల కేంద్రం నుంచి కాగజ్‌నగర్ 30 కిలోమీటర్ల దూరం ఉంది. మండల కేంద్రం నుంచి కోత్మీర్ వరకు సింగిల్ రోడ్డు ఉంది. అక్కడి నుంచి కాగజ్‌నగర్ వరకు డబుల్ రోడ్డు ఉంది. కోత్మీర్ నుంచి మండల కేంద్రం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ఏడాదిన్నర క్రితమే ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి సుమారు రూ.30 కోట్లు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కేవలం కల్వర్టులు నిర్మించి పనులు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లగ్గాం, పెంచికల్‌పేట్ మీదుగా కాగజ్‌నగర్ వెళ్లాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు సైతం మరింత అధ్వానంగా మారింది. బెల్లంపల్లి -మంచిర్యాలకు వెళ్లాలన్నా నల్ల చెరువు వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాపోతున్నారు. ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపడుతాం

వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు టెండర్లు పూర్తయ్యాయి. కొన్ని రోడ్లకు టెండర్లు కాలేదు. వర్షాలు కురుస్తున్నందున రోడ్లకు మరమ్మతులు చేపట్టడం వీలు కావడం లేదు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే చెడిపోయిన రోడ్లకు మరమ్మతులు చేపడుతాం.

– రాథోడ్ సురేశ్, ఆర్‌అండ్‌బీ ఈఈ

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

దహెగాం: సిర్పూర్(టి) నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయమని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మారుమూల గ్రామమైన మొట్లగూడ, రావులపల్లి, రాంపూర్, దిగిడ, కర్జి, ఒడ్డుగూడ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకొని గ్రామాభివృద్ధికి పాటు పడాలన్నారు. మిషన్ భగీరథ తాగునీరు రావడం లేదని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తాగునీరు అందేలా చూడాలన్నారు. మొట్లగూడ ప్రాంతానికి సరైన రోడ్డు లేదన్నారు. రోడ్లన్నీ అధ్వానంగా మారాయని, గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కొంగ సత్యనారాయణ, సలీం, షాకీర్, నారాయణ, నవీన్, కవిత, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



సిబ్బందితో అధికారులు

వాంకిడి: 108, 102 అంబులెన్స్‌ల ద్వారా మెరుగైన సేవలు అందించాలని ఆ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ మెరుగు నరేశ్ అన్నారు. బుధవారం మండలంలోని 108, 102 వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని మెడికల్ పరికరాలు, పనితీరును పరిశీలించారు. మూడు నెలలకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే స్పందించాలని, మాత్రలు, మందుల గడువు తేదీలను పరిశీలిస్తూ ఉండాలని, నెల గడువు ఉన్న మందులను వెంటనే మార్చుకోవాలని సూచించారు. ఆయన వెంట ఈఎంటీ ప్రవీణ్, పైలెట్ భీంరావు, సీతారాం, తాజ్ ఉన్నారు.

ఆకుకూరలతోనే ఆరోగ్యం



మొక్కలు పంపిణీ చేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు

కెరమెరి: ఆకుకూరలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉండగలుగుతామని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ప్రసున, ఉద్యానవన శాస్త్రవేత్త డా.స్రవంతి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దసాకడ గ్రామంలో కుమురం భీం సేంద్రియ ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు ఉచితంగా మునగ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిరప పంటలపై వైరస్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రైతులు పంటలపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం వారు మునగ మొక్కలు నాటారు. కార్యక్రమంలో రైతులు కేంద్రె బాలాజీ, రాంచందర్, గోపాల్, రాము తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్యాంనాయక్

కెరమెరి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టి కృషితో అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఆసిఫాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాం నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి పలువురు కాంగ్రెస్‌లోకి చేరారు. వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పథకాలను చూసి ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కార్యకర్తలు బాగా పని చేసి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను క్లీన్‌స్వీప్ చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు తప్పని తిప్పలు



ఎల్లాగౌడ్ తోటలోని ఆధార్ కేంద్రం

కాగజ్‌నగర్ టౌన్: ఆధార్ అప్‌డేట్‌కు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లాగౌడ్‌తోటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రంలోని నిర్వాహకులు ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలను రేపుమాపు అంటూ తిప్పించుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారం రోజులుగా కేంద్రానికి వచ్చిన ఇప్పటి వరకూ ఆధార్ అప్‌డేట్ చేయడం లేదని వాపోతున్నారు. ప్రతీరోజు ఏదో ఒక కారణంగా తిప్పి పంపుతున్నారు. ఈ విషయమై కేంద్రం నిర్వాహకుడిని ఫోన్‌లో సంప్రదిస్తే అందుబాటులోకి రాలేదు. సంబంధిత అధికారులు స్పందించి ఇబ్బంది కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పెళ్లి ఖర్చులకు పోలీసుల ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న పోలీసులు

బెజ్జూర్: శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వర్తించే పోలీసులు మరోసారి మానవత్వం చాటారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ ఆధ్వర్యంలో ఎస్సై మహమ్మద్ సర్దార్ పాషా పేదింటి ఆడపిల్ల పెళ్లి ఖర్చుల కోసం ఆర్థికసాయం అందజేశారు. బెజ్జూర్ మండలం కుకుడా గ్రామానికి చెందిన మహమ్మద్ ఇర్షాద్ ఆర్థిక పరిస్థితి బాగాలేక తన కూతురి పెళ్లి ఖర్చులను భరించలేని పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు ముందుకువచ్చి బుధవారం రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. నేరాల నియంత్రణ మాత్రమే పోలీసుల బాధ్యత కాదని, సమాజంలో పేదలను ఆదుకోవడం కూడా మా కర్తవ్యమన్నారు.

మహిళలకు అన్నిరంగాల్లో ప్రోత్సాహం



సొసైటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ

రెబ్బెన: రాష్ట్రంలోని మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో ప్రోత్సహిస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ కార్యాలయాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాం నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి స్వయం ఉపాధికి అనుకూల విధానాలు అమలు చేస్తోందని అన్నారు. మహిళల అభివృద్ధే లక్ష్యంగా మారుమూల మండలంలో సొసైటీ ఏర్పాటు చేయడం శుభపరిణామని కొనియాడారు. మహిళలు ఆత్రం సుగుణను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, శ్యాం, దేవాజీ, సోమశేఖర్, శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

కౌటాల: మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి బుధవారం స్థానిక రైతు వేదికలో అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో హన్మంతు ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు. మెరుగైన విద్యను అందించినప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. అంకిత భావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

సీజేపై దాడికి నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై న్యాయవాది కిషోర్ ప్రకాశ్ దాడి చేయడాన్ని నిరసిస్తూ అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ, దీక్షభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టెక్నికల్ అసిస్టెంట్ మృతి



సురేందర్‌గౌడ్ (ఫైల్)

లింగాపూర్: జైనూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ సురేందర్ గౌడ్ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విధుల్లో ఉండగా మధ్యాహ్నం 12 గంటలకు గుండెపోటు రాగా గమనించిన సిబ్బంది స్థానిక జైనూర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు.

నేడు వీవోఏలకు సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు 34వీవో, వీవోఏలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం ముక్తేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. వీవోల బలోపేతం, పొదుపు, పుస్తకాలు రాసే విధానం తదితర అంశాలపై సమావేశం ఉంటుందని వీవోఏలు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

డీఎస్పీకి నివాళులు

ఆసిఫాబాద్‌రూరల్: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన డీఎస్పీ విష్ణుమూర్తి చిత్రపటానికి బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద సెంట్రల్ కమిటీ దీక్ష భూమి కమిటీ, జైభీం సేవ కమిటీ సభ్యులు నివాళులర్పించారు. ఈసందర్భంగా డీఎస్పీ చిత్రపటానికి పూల మాల వేశారు. నాయకులు హోక్టు, విష్ణుమూర్తి, సుధాకర్, తుకారాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో కోట ప్రసాద్

చింతలమానెపల్లి: మండలంలోని రుద్రాపూర్ రైతు వేదికలో బుధవారం పోలింగ్ అధికారులు, సిబ్బందికి స్థానిక సంస్థల ఎన్నికలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సందర్భంగా శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. శిక్షణలో ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి జయరాజ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌటాలలో..

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కౌటాల మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం పీవో, ఏపీవోలకు అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ విధులపై అవగాహన కల్పించారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎంపీడీవో కోట ప్రసాద్, శిక్షణ అధికారి శాంతి కుమార్, ఎంఈవో గావుడే హన్మంతు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నిరంతర సాధనతో విజయాలు సొంతం'

రెబ్బెన: క్రీడాకారులు తమలోని క్రీడా నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడూ మెరుగుపర్చుకుంటే అద్భుత విజయాలు సొంతమవుతాయని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. 92వ డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడల్లో భాగంగా ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కంపెనీ స్థాయి క్యారం, చెస్ పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి బెల్లంపల్లి ఏరియా జీఎం ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని ఏరియాల్లో అందుబాటులో ఉన్న వసతులను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుంటూ క్రీడానైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడాకారులకు, న్యాయ నిర్ణేతలకు బహుమతులు అందజేశారు. అధికారుల సంఘం ఏరి యా అధ్యక్షుడు మచ్చగిరి నరేందర్, ఏఐటీయూసీ నాయకులు కిరణ్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, సీనియర్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్‌వెస్లీ, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ అన్వేశ్ పాల్గొన్నారు.

బుద్ధుడు, అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న సిద్ధార్థ రామ్మూర్తి

వాంకిడి: భగవాన్ గౌతమ బుద్ధుడు, బాబాసాహెబ్ అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సిద్ధార్థ రామ్మూర్తి, నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి అ న్నారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహారలో మంగళవారం రాత్రి 34వ వర్షవాస్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మూడు నెలలుగా బౌద్ధ గురువు భంతే భరద్వాజ్ ఆధ్వర్యంలో 'బుద్ధుడు బౌద్ధ ధమ్మము' గ్రంథ పఠనం కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగంగా ప్రతిఒక్కరూ విద్యావంతులుగా నిలదొక్కుకోవాలని సూచించారు. మహారాష్ట్ర సరిహద్దులోని వాంకిడిలో బుద్ధిజం, అంబేడ్కరిజంపై చూపుతున్న మక్కువ గొప్పదన్నారు. అంతకు ముందు బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, ఎస్ఎస్‌డీ జిల్లా అధ్యక్షుడు దుర్గం సందీప్, లక్ష్మణ్ సేవా సదన్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ గాదె అవినాశ్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గజానంద్

ఆసిఫాబాద్‌రూరల్: పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ గజానంద్ అన్నారు. జిల్లా కేంద్రంలో చిల్డ్రన్స్ పార్క్‌లో చేపట్టిన పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పార్కును పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సందర్శనకు వచ్చిన ప్రజలు ప్రత్యేకంగా కేటాయించిన డస్ట్ బిన్‌లో మాత్రమే చెత్త వేయాలని సూచించారు.